సాక్షి తిరుపతి

సోమవారం । 24 । జూలై । 2023



గణనాథుని దర్శనానికి 5గంటలు
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది.
- 2లో



సర్కార్ బడుల్లో డిజిటల్ పాఠాలు
ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తోంది.బడుల్లో డిజిటల్ హంగులు సమకూరుస్తోంది.
- 2లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	32	26
చిత్తూరు	31	26
తిరుమల	27	21
గూడూరు	32	26
నగరి	32	26

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను నియమించినట్లు వివరించారు. స్పందనకు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యాలయంలోనే ఉంటూ సబార్డినేట్‌లను పంపితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు

ఆగస్టులో విశేష ఉత్సవాలు

తిరుమల : ఆగస్టులో నిర్వహించనున్న విశేష ఉత్సవాలపై టీటీడీ పీఆర్‌ఓ విభాగం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. 1వ తేదీన పౌర్ణమి గరుడ సేవ, 12న మతత్రయ ఏకాదశి, 15న భారత స్వాతంత్ర్య దినోత్సవం , శ్రీ చక్రత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం, శ్రీ ప్రతివాది భయంకర అణ్ణంగరాచార్య వర్షతిరునక్షత్రం, 21న గరుడ పంచమి, తిరుమల శ్రీవారి గరుడ సేవ, 22న కల్కి జయంతి, 25న తరిగొండ వెంగమాంబ వర్ధంతి, వరలక్ష్మీవ్రతం, 26న తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 27 నుంచి 29వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు, 30న శ్రీ వైఖానస మహాముని జయంతి, శ్రావణపౌర్ణమి, రాఖీ పండుగ, 31న హయగ్రీవ జయంతి. తిరుమల శ్రీవారు శ్రీ వైఖనసాచార్య స్వామి సన్నిధికి వేంచేపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

గంగమ్మకు సారె సమర్పణ



సారె తీసుకువస్తున్న కేంద్ర సహాయ మంత్రి కపిల్ మొరేశ్వర పాటిల్

తిరుపతి కల్చరల్: తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లికి కేంద్ర సహాయ మంత్రి కపిల్ మొరేశ్వర పాటిల్ ఆదివారం సాంప్రదాయ సారె సమర్పించారు. ఆలయం వద్ద బీజేపీ తిరుపతి పార్లమెంట్ సాంస్కృతిక శాఖ కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మంత్రి ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ నేతలు సుబ్రమణ్యం యాదవ్, సామంచి శ్రీనివాస్, కొండే చెంగారెడ్డి, మురళి, కవిత, విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

31లోపు ఈకేవైసీ తప్పనిసరి

తిరుపతి సిటీ : పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందేందుకు రైతులు ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు దాదాపు 95శాతం మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన వారు సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ-క్రాప్ నమోదు తప్పనిసరని తెలిపారు.

గురుకుల క్రీడా పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

రేణిగుంట: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోని గిరిజన గురుకుల క్రీడా పాఠశాలలో 5, 6వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరు ఐటీడీఏ పీడీ మందరాణి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ జోన్-4 పరిధిలోని (పూర్వపు చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం) జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఈనెల 27వ తేదీన రేణిగుంట గిరిజన గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గిరిజన గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో 4వ తరగతి పూర్తి చేసుకున్న గిరిజన బాలురు పరీక్షకు హాజరుకావచ్చన్నారు. భౌతిక పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా 20మంది విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు వివరించారు. అరకులో ఆగస్టు 4వ తేదీన నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులు క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందుతారని తెలిపారు. ఆసక్తిగలవారు స్టడీ, వయస్సు నిర్ధారణ సర్టిఫికెట్లతో రావాలన్నారు. వివరాలకు 9603310648, 7989673218, 9160282 620 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అల్పపీడనం ప్రభావం



తూపిలిపాలెం బీచ్‌లో పోలీసు

వాకాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సోమవారం అల్పపీడనంగా మారనుందని, పర్యాటకులు సముద్రం వద్ద జాగ్రత్తలు పాటించాలని ఆదివారం మెరైన్ పోలీసులు హెచ్చరికలు జారీచేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడు రొంపిచెర్లకు చెందిన తాతిరెడ్డి. ఇతనికి కిడ్నీ సమస్యతో పాటు బీపీ కూడా ఉంది. ఇంటి నుంచి బయటికి రాలేడు. సమీప పట్టణానికి వెళ్లి వైద్యం చేయించుకునేవాడు. ఆయనకు తోడుగా ఒక మనిషి, రవాణా ఖర్చులు భరించాల్సి వచ్చేది. ఫ్యామిలీ డాక్టర్ వచ్చాక సేవలు గడప దాటకుండా అందడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఈ ఫొటోలో వైద్యం చేయించుకుంటున్న వృద్ధురాలి పేరు హాలేమ్మ. ఈమెది యాదమరి మండలం కంద్రిగ గ్రామం. కంటి సమస్యతో కొన్నాళ్లుగా మంచానికే పరిమితమైంది. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ప్రతినెలా ఈమె ఇంటికే వెళ్లి డాక్టర్లు పరీక్షిస్తున్నారు. తగిన మందులు, మాత్రలు ఇస్తున్నారు. దీనిపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కింది ఫొటోలో చికిత్స పొందుతున్న బత్తెమ్మ(36)ది ఏర్పేడు మండలం, ఎండీ.పుత్తూరు దళితవాడ. ఈమె పుట్టుకతోనే దివ్యాంగురాలు. మాటలు రావు. తల్లి వెంకటమ్మ దినసరి కూలీ. బత్తెమ్మను కొన్నాళ్లు పాటు గ్రామానికి 15 కి.మీ దూరంలో ఉన్న ఏర్పేడు లెప్రసీ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. తర్వాత పాపానాయుడు పేటలోని ఆర్ఎంపీ డాక్టర్ల వద్దకు తీసుకెళ్లేవారు. కందాడలోని ఒక ఆర్ఎంపీని నెలలో మూడు సార్లు ఇంటికి రప్పించుకుని వైద్యపరీక్షలు చేయించేవారు. ఇందుకు గాను ఫీజుగా రూ.200 నుంచి రూ.300 వరకు సమర్పించేవారు. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ విధానం వచ్చిన తర్వాత ఆ భారమంతా తప్పిందని, నెలకు రెండు సార్లు ప్రభుత్వ వైద్యులు గడప వద్దకే వచ్చి కుమార్తెకు వైద్యం చేస్తున్నారని వెంకటమ్మ సంతోషంగా చెబుతోంది.



పల్లెకు ఊపిరి!

- గ్రామీణ ప్రజలకు మరింత చేరువైన ఫ్యామిలీ డాక్టర్
- పల్లె ముంగిటే డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు స్వాంతన
- నెలకు రెండు సార్లు పల్లెకు వైద్యులు
- చికిత్సలకు బారులుతీరుతున్న రోగులు

పల్లెవాసుల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి ముంగిటే వైద్యసేవలను అందుబాటులోకి తీసువచ్చింది. ఫ్యామిలీ ఫిజీషియన్ పేరిట సొంతూరిలోనే చికిత్సలు పొందే అవకాశం అందించింది. గ్రామీణులకు పైసా ఖర్చు లేకుండా మందులను సైతం పంపిణీ చేస్తోంది. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను మరింత బలోపేతం చేసింది. వృద్ధులు.. గర్భిణులు.. బాలింతలు.. చిన్నారులతోపాటు మంచానికే పరిమితమైన రోగులు.. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పల్లెలోనే ఆరోగ్యసేవలు అందుకునే వెసులుబాటు కల్పించింది. ప్రజల వద్దకే పాలన అన్నట్టు.. పల్లె చెంతనే వైద్యం తీసుకురావడంపై సర్వత్రా హర్షాతిరేకరం వ్యక్తమవుతోంది.

– సాక్షి, తిరుపతి / చిత్తూరు రూరల్

హెల్త్ క్లినిక్‌లు ఇలా...

సచివాలయాల్లో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. స్థానిక పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యుడు డాక్టర్ వైఎస్సార్ 104 సంచార వాహనం ద్వారా నెలలో రెండు సార్లు హెల్త్ క్లినిక్‌లకు వస్తున్నారు. ఈ క్లినిక్ ప్రారంభం కాని చోట ప్రత్యామ్నాయ భవనంలో వైద్య పరీక్షలు చేస్తున్నారు. డాక్టర్ వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ వర్కర్స్ ఉంటున్నారు. ఒక రోజు ముందుగానే స్థానికులకు వలంటీర్ల ద్వారా హెల్త్‌క్లినిక్ సమాచారం ఇస్తున్నారు.

గతంలో ఇలా..

గతంలో ఏదైనా జబ్బు చేస్తే ముందుగా పీహెచ్‌సీకి వెళ్లేవారు. అక్కడి డాక్టర్లకు జబ్బు అర్థంకాకపోయినా, తీవ్రమైందిగా భావించినా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి పంపించేవారు. సబ్ సెంటర్లో పరిస్థితి చెప్పనవసరం లేదు. అక్కడ ప్రాథమిక వైద్యం అందేది కాదు. కొన్నిసార్లు జ్వరం తగ్గకపోయినా సరే ప్రతి ఒక్కరూ జిల్లా ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెట్టేవారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘ కాలిక వ్యాధులకు తప్పనిసరిగా జిల్లా కేంద్రంలోనే వైద్యం చేయించుకోవాల్సి వచ్చేది. ప్రసవ సేవల కోసం జిల్లా ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి.

పల్లె వైద్యం ఇలా...

- ఉదయం 9 గంటలకే హెల్త్ సెంటర్లకు చేరుకుని మధ్యాహ్నం వరకు ఓపీ సేవలు చూస్తున్నారు. మధ్యాహ్నం నుంచి ఊరు బాగోగులు, మంచం పట్టిన బాధితులకు ఆరోగ్య పరీక్షలు, సేవలు చేస్తూ సాయంత్రం 4 గంటలకు వరకు వైద్యులు పల్లె నాడి పడుతున్నారు.
- జనరల్ అవుట్ పేషెంట్‌లకు సేవలు
- బీపీ, షుగర్, ఊబకాయం లాంటి జీవనశైలి జబ్బుల కేసుల ఫాలోఅప్
- గర్భిణులకు యాంటినేటల్ చెకప్స్, బాలింతలకు పోస్ట్‌నేటల్ చెకప్స్, ప్రసవానంతర సమస్యల ముందస్తు గుర్తింపు
- చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చిన లోపాల గుర్తింపు
- రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, చిన్న పిల్లలకు వైద్యం
- వైఎస్సార్‌ఆర్ ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేసుకున్న రోగులు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితమైన వారికి, వృద్ధులకు ఇంటి వద్దే వైద్యం.
- పాలియేటివ్ కేర్
- తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ నిర్ధారణ
- ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన
- బీపీ, షుగర్లకు సైతం వైద్యపరీక్షలు.. ఉచితంగా మందులు
- పీహెచ్‌సీ లేదా టెలీమెడిసిన్ సెంటర్ వైద్యులకు ఫోన్ చేసి రోగులతో మాట్లాడించి చికిత్స

రోగులకు చేస్తున్న పరీక్షలు

- గర్భ నిర్ధారణ టెస్ట్
- హిమోగ్లోబిన్ టెస్ట్
- ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్ (షుగర్)
- మలేరియా టెస్ట్
- హెచ్ఐవీ నిర్ధారణ
- డెంగీ టెస్ట్
- మల్టీపారా యూరిన్ స్ట్రిప్స్ (డిప్‌స్టిక్)
- అయోడిన్‌టెస్ట్
- వాటర్ టెస్టింగ్
- హెపటైటిస్ బీ నిర్ధారణ
- ఫైలేరియాసిస్ టెస్ట్
- సిఫిలిసిస్ ర్యాపిడ్ టెస్ట్
- విజువల్ ఇన్‌ఫెక్షన్
- స్పుటమ్ (ఏఎఫ్‌బీ)



చిత్తూరు రూరల్ మండలంలో వృద్ధుడికి సేవలందిస్తున్న వైద్యులు



ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరు దళితవాడలో బత్తెమ్మకు చికిత్స అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్

ఉమ్మడి జిల్లా వివరాలు

పీహెచ్‌సీలు	106
హెల్త్ క్లినిక్‌లు	903
ఫ్యామిలీ ఫిజిషన్‌లు	198
104 వాహనాలు	78

వైద్యసేవలు పొందిన వారు

జనరల్ ఓపీ	5,25,674
ఏఎన్‌సీ	26,847
పీఎన్‌సీ	18,654
రక్తహీనత	3,546
బీపీ	62,143
షుగర్	61,873
క్యాన్సర్	2,409

ఊరికే వచ్చి మందులిస్తున్నారు



గతంలో చిన్నపాటి రోగానికి కూడా మందుల కోసం 5 కిలోమీటర్లు పరుగెత్తేవాళ్లం. ఇప్పుడు ఊర్లోనే ఫ్యామిలీ డాక్టర్ వచ్చి చికిత్సలు అందిస్తున్నారు. అన్ని రకాల మందులు ఇస్తున్నారు. నెలకు రెండు సార్లు డాక్టర్లు వస్తున్నారు. ప్రయాణ ఖర్చులు, వ్యయప్రయాసాలు తప్పాయి.

–దేవ, చిన్న తయ్యూరు(ఎస్ఆర్‌పురం)

గ్రామంలో వైద్యసేవలు



చిన్నపాటి జ్వరం వచ్చినా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే రోజులు పోయాయి. ఫ్యామిలీ ఫిజిషియన్‌తో గ్రామంలోనే వైద్యసేవలు అందుతున్నాయి. బీఎస్సీ నర్సింగ్ చేసిన నర్సులు సైతం రోగి ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నారు. పెద్ద వ్యాధిగా అనుమానం వస్తే టెలీమెడిసిన్ ద్వారా వైద్యులను సంప్రదించి మందులు ఇస్తున్నారు. – శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

పేదలకు వరం



సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యసేవలు చాలా బాగా అందిస్తున్నారు. ఊరు పక్కనే ఆస్పత్రి కట్టించి మందులు, మాత్రలు ఇస్తున్నారు. పట్టణం పోయే పనిలేదు. ఆస్పత్రి ఖర్చులు తగ్గాయి. గతంలో ఊర్లోకి డాక్టరు వచ్చేవారు కాదు. ఇప్పుడు విధిగా నెలకు రెండు సార్లు కనిపిస్తున్నారు. – చిదంబరం, చిత్తూరు

ప్రజల వద్దకే వెళుతున్నాం



ఫ్యామిలీ ఫిజిషియన్‌లో గ్రామాల్లోకి వెళ్లి సేవలు అందిస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరీక్షిస్తున్నాం. పరీక్షలు అవసరమైతే అక్కడే చేయించి తగిన మందులు, మాత్రలు ఇస్తున్నాం. ఆశావర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ఎప్పటి కప్పుడు ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటున్నాం.

– డాక్టర్ శిల్ప, పాపనాయుడుపేట పీహెచ్‌సీ

చంద్రబాబు అవినీతి అనంతం



జగనన్నకే ఓటు వేస్తానని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి చెబుతున్న టీడీపీ నేత ఊర్మిల

తిరుపతి మంగళం : చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో చేసిన అవినీతి అనంతమని, సరైన వేదికల్లో విచారణ జరిగి ఉంటే 200 ఏళ్ల జైలుశిక్ష పడేదని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వెల్లడించారు. ఆదివారం తిరుపతి 7వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో సాధికారిత సర్వే పేరుతో అప్పటి ఐటీ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేశారని ఆరోపించారు. అసలు డేటా దొంగలే ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అబద్ధపు హామీలతో మోసం చేసింది చంద్రబాబు, లోకేష్ అయితే, ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల హృదయం గెలుచుకున్న జన నేత జగనన్న అని తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా శ్రమిస్తున్న గొప్ప నాయకుడు జగనన్నను విమర్శించే స్థాయి.. అర్హత లోకేష్‌కు లేదని స్పష్టం చేశారు. బీచ్‌లు, స్విమ్మింగ్‌పూల్‌లో అమ్మాయిలతో జల్సాలు చేసే జీవితం లోకేష్‌ది అయితే నాది కాలేజ్ జీవితమని, జగన్‌రెడ్డిది జైలు జీవితమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేసేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, స్థాయి మించి మాట్లాడితే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో కూడా చంద్రబాబును ప్రజలు తిరస్కరించడం తథ్యమని తెలిపారు. టీడీపీ పూర్తిగా భూస్థాపితమవుతుందని స్పష్టం చేశారు.

టీడీపీలో చిన్నపాటి సాయం కూడా పొందలేదు

టీడీపీలో తన భర్త ఉమాపతి, వార్డు అధ్యక్షురాలిగా తాను ఎనలేని సేవలందించినా ఏనాడూ చిన్నపాటి లబ్ధి కూడా పొందలేదని ఆ పార్టీ నేత ఊర్మిళ తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలతో పాటు సొంతింటి కల కూడా సాకారమైందని ఆనందంగా వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ఓటేస్తామని స్పష్టం చేశారు. దీనిపై ఎమ్మెల్యే భూమన స్పందిస్తూ పార్టీలు, కులాలు, మతాలు చూడ కుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన నాయకుడు జగనన్న అని కొనియాడారు.

'మహతి'లో జాతీయస్థాయి నాటక పోటీలు



నృత్య ప్రదర్శనలో కళాకారుల భంగిమ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి కల్చరల్ : టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అభినయ ఆర్ట్స్ వారు ఈనెల 30వ తేదీవ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో మొదలైన పోటీలను ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. వారు మాట్లాడుతూ అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్ రెడ్డి కళామాతకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కళలు సమాజ చైతన్య కరదీపికలని, వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యంతో పాటు కళారంగానికి విశేష సేవలు అందిస్తున్న కళాకారులను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలో మధ్యాహ్నం వరకు నిర్వహించిన నృత్య పోటీలలో కళాకారులు అద్భుతంగా అభినయించి అలరించారు. బాపట్ల శ్రీవిఘ్నేశ్వర నవ్యనాటక కళాసమితి ఆధ్వర్యంలో మహా వీర ధనంజయ పౌరాణిక పద్యనాటకాన్ని ప్రదర్శించారు. తెనాలికి చెందిన డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ది వెనస్ సాంఘిక నాటక ప్రేక్షకులను రంజింపజేసింది. అనంతరం బీఎస్ రెడ్డి కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అభినయ ఆర్ట్స్ ప్రతినిధులు విజయకుమార్, నరసింహులు, పీఆర్ నాయుడు, మర్దం గజేంద్ర, ధర్మయ్య పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి- నెల్లూరుకు నూతన బస్సులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి-నెల్లూరు మధ్య రాకపోకల సాగించేందుకు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులకు పచ్చ జెండా ఊపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి-నెల్లూరుకు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే శ్రీకాళహస్తి నుంచి తిరుచానూరు, విజయవాడ, అన్నవరం, విశాఖపట్నానికి కూడా త్వరలో బస్సు సర్వీసులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సైతం ప్రత్యేకంగా బ్యాటరీ బస్సులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు గుమ్మడి బాలకృష్ణయ్య, పగడాల రాజు, వయ్యాల కృష్ణారెడ్డి, రత్నంరెడ్డి, షేక్ సిరాజ్‌బాషా, మున్నా, జయశ్యామ్‌రాయల్, జయగోపాల్, గోరా, ఫజల్, బాబు, యతిరాజులు, హరినాయుడు, పఠాన్ ఫరీద్, మధురెడ్డి, పసల సురేష్, నజీర్, సురేష్, పులి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



బస్సులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

క్లుప్తంగా

మొదటి ఘాట్‌లో ఎలుగుబంటి


ఘాట్‌రోడ్ సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్ లో ఆదివారం సాయంత్రం ఎలుగుబంటి సంచారం కలకలం రేపింది. వాహనాల్లో వస్తున్న భక్తులు మూడో కిలోమీటర్ వద్ద ఎలుగుబంటిని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. అది అడవిలోకి వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గణనాథుని దర్శనానికి 5గంటలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవర సిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు పోటెత్తడంతో వినాయకస్వామి దర్శనానికి ఐదు గంటల సమయం పట్టింది. ఉదయం నుంచి కంపార్ట్ మెంట్‌లు, క్యూలు నిండిపోయి ఆరు బయట వరకు భక్తులు బారులు తీరారు. భక్తులు త్వరితగతిన దర్శనం చేసుకునేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.

సర్కార్ బడుల్లో డిజిటల్ పాఠాలు

ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ హంగులు సమకూర్చి అంతర్జాతీయ ప్రమాణాలను కల్పిస్తోంది. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ విద్యారంగంలో పూర్తిస్థాయి సంస్కరణలకు నాంది పలికిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టిస్తోంది. ఇందులో భాగంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ)లు, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు సరికొత్త విద్యా బోధనలు అందుబాటులోకి తెస్తోంది. ఇందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది.

- ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలతో విద్యాబోధన
- జిల్లాలో తొలి విడతలో 418 పాఠశాలల ఎంపిక
- స్కూళ్లకు చేరిన సాంకేతిక ఉపకరణాలు
- 5,971 మంది ఉపాధ్యాయులకు శిక్షణ


పుత్తూరులో డిజిటల్ పాఠాలపై శిక్షణ (ఫైల్)


పుత్తూరుకు చేరిన ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు

పుత్తూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సైతం ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొనేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం డిజిటల్ హంగులు సమకూరుస్తోంది. బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో రాస్తూ పాఠ్యాంశాలు బోధించే పద్ధతి కనుమరుగు కానుంది. రానున్న రోజుల్లో పూర్తిగా డిజిటల్ పద్ధతుల్లో బోధన కొనసాగనుంది. ఇందుకు అనుగుణంగా హైస్కూల్స్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ద్వారా బోధన చేస్తారు. వాటికి ఇంటర్నెట్‌ను అనుసంధానం చేయనున్నారు. అలాగే బైజూస్ కంటెంట్‌తో పాఠాలు బోధిస్తారు. తద్వారా పాఠ్యాంశాలు అనేక ఉదాహరణలతో విస్తృతమైన రూపకల్పనలతో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధనలు ఉంటాయి. ఫలితంగా అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైతం పోటీపడే అవకాశం ఏర్పడుతుంది.

యుద్ధప్రాతిపదికన పరికరాల ఏర్పాట్లు

చిత్తూరు జిల్లాలో ఇప్పటికే ఎంపికైన పాఠశాలలకు ఐఎఫ్‌పీ, స్మార్ టీవీలు, ఇతర సాంకేతిక ఉపకరణాలు చేరాయి. ఇకపై తరగతి గదుల్లో ఆధునిక పద్ధతుల్లో విద్యా బోధనలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో తొలి విడతగా 418 పాఠశాలను ఎంపిక చేయగా, ఇందులో 160 హైస్కూల్స్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)లు, 258 ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఉపకరణాలు ఆయా పాఠశాలలకు చేరాయి. వాటికి అవసరమైన ఇతర పరికరాలను యుద్ధ ప్రాతిపదికన పాఠశాలలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

డిజిటల్ పరికరాల వినియోగంపై తొలి విడత శిక్షణకు జిల్లాలో 5,971 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన కళాశాలల్లో, పాఠశాలల్లో 40 మందిని ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు.4,993 మంది శిక్షణ పొందారు.

ఇక అర్థవంతంగా బోధన



విద్యార్థులకు సులభతరంగా పాఠాలు అర్థమయ్యేందుకు డిజిటల్ బోధనలు ఎంతగానో దోహదపడుతాయి. పాఠశాలల్లో వీటి వినియోగం గొప్ప మార్పుకు సంకేతం. తొలి విడతలో ఎంపికైన పాఠశాలలకు డిజిటల్ ఉపకరణాలు చేరాయి. ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో తీసుకొస్తున్న ఈ మార్పుతో మంచి ఫలితాలు వస్తాయని ఘంటాపథంగా చెప్పగలం.
– సి.విజయేంద్రరావు,డీఈఓ, చిత్తూరు



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,300
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,505

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,500
రిటైల్ వెండి గ్రాము	రూ.78.50

తిరుపతిలో మొహరం సందడి


గాలివీధిలోని చావడిలో ఏర్పాటు చేసిన పీర్లు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలో మొహరం పండుగ సందడి నెలకొంది. ముస్లింలు ఈ నెల 29వ తేదీన మొహరం పండుగను జరుపుకోనున్నారు. కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం గాలివీధి చావడిలో పీర్లను ఏర్పాటుచేశారు. ఈ నెల 25న జెండా పీరు, 26 గొడుగు పీరు, 27న ఒక నాలుక పీరు కొలువుదీరి పూజలందుకోనున్నాయి. 28వ తేదీన గాలివీధి చావడి వద్ద అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నారు. 29న చావడిలో కొలువుదీరిన పీర్లను వీవీ మహల్ రోడ్డులోని దర్గా వరకు ఊరేగింపు చేపట్టి జల్లి చేపడతారు. కలాం, సాదిక్, సల్మాన్, అబ్బు, అన్వర్ పాల్గొన్నారు.

కోదండరామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి ఆలయంలో ఆగస్టులో విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఆగస్టు 1, 31వ తేదీల్లో పౌర్ణమి సందర్భంగా ఉదయం 9 గంటలకు అష్టోత్తర శతక లశాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సీతా లక్ష్మణ సమేత కోదండరామ స్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు. ఆగస్టు 5, 12, 19, 26వ తేదీల్లో శనివారం ఉదయం 6 గంటలకు సీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం చేస్తారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం ఆలయంలో ఊంజల్ సేవ చేస్తారు. 14వ తేదీన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 5.30 గంటలకు రామచంద్ర పుష్కరిణి వద్ద ఊంజల్ సేవ చేపడతారు. 16వ తేదీన అమావాస్య నాడు ఆలయంలో ఉదయం 7 గంటలకు సహస్ర కలశాభిషేకం జరుగనుంది. అదే రోజు రాత్రి 7 గంటలకు కోదండరామ స్వామి హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇస్తారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


కళాకారుల నృత్య భంగిమ

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పుష్ప శిష్య బృందం ఆధ్వర్యంలో కళాకారులు భరతనాట్యం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. కళాకారులు నాట్య గురువు పుష్ప, లాస్య, తానవిక, జోషిని, విద్య, తనూష, కీర్తి, అనన్య, వేదను ఏట ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోట : మండలంలోని కొండుగుంటలో ఈ నెల 12వ తేదీన ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సునీల్(31) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఐ పుల్లారావు మాట్లాడుతూ అప్పుల బాధతో సునీల్ విషపుగుళికలు తిన్నట్లు వెల్లడించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబీకులు వేలూరు సీఎంసీకి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు వెల్లడించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.తండ్రి వెంకటరమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాబు స్క్రిప్ట్ చదవడమే పవన్ అజెండా


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, పక్కన విజయానందరెడ్డి తదితరులు

గంగాధరనెల్లూరు: జనసేన పార్టీకి మెనిఫెస్టో అంటూ ఏమీలేదని, చంద్రబాబు, రామోజీ స్క్రిప్ట్ చదవడమే అజెండా అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తీవ్రంగా విమర్శించారు. ప్రజలంతా కోరుకుంటున్న వలంటీర్ల వ్యవస్థపై క్యారెక్టర్ లేని పవన్ కల్యాణ్ విషం కక్కడంపై ప్రజలు ఏవగించుకుంటున్నారని, సినిమా జీవితాన్ని జీర్ణించుకుని పెళ్లిళ్లు చేసుకోవడంలో మిన్నేగానీ.. రాజకీయ జ్ఞానంలో పవన్ సున్న అని ఆరోపించారు. ఆదివారం వేల్కూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏలాంటి రాజకీయ అనుభవం లేకుండా, చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారి సువర్ణ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం తగదని తెలిపారు. ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించడమే లక్ష్యంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకు వచ్చి ఇంటి ముంగిటే పాలన అందిస్తు గాంధీ కలలు గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగనన్న తీసుకు వచ్చారని తెలిపారు. పలు పెళ్లిళ్లు చేసుకున్న పవన్ కల్యాణ్ మహిళల గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవ చేశారు. కుల, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా సంక్షేమాలు అందిస్తుంటే వెన్నుపోటుకు కేరాఫ్ అయిన చంద్రబాబు, పవన్ అవాస్తవ ఆరోపణలతో అభివృద్ధి నిరోధకలుగా మారారని అన్నారు. ప్రజలంతా సీఎం జగనన్న వెంటే ఉన్నారని, జగన్‌మోహన్‌రెడ్డి 30 సంవత్సరాలు సీఎంగా ఉండాలని ప్రజలు ఆశీర్వదరిస్తున్నారని తెలిపారు.

శ్రీవారి సేవలో 'బేబీ' టీమ్


ఆలయం వెలుపల బేబీ సినిమా యూనిట్

తిరుమల: తిరుమల శ్రీవారిని బేబీ సినిమా టీమ్ ఆదివారం ఉదయం నైవేద్య విరామ సమయంలో దర్శించుకుంది. నటులు ఆనంద్ దేవర కొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్, దర్శకుడు సాయి రాజేష్ నీలం, నిర్మాత శ్రీనివాస్ కుమార్ తదితరులు స్వామి వారి సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనంతరం వీరికి ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వెలుపల నిర్మాత శ్రీనివాస్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ బేబీ సినిమా ఘనవిజయం సాధించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీవేంకటేశ్వర స్వామివారికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు తిరుమలకు వచ్చామని వెల్లడించారు.

కారును ఢీకొన్న ఆటో


గాయపడిన భువనేశ్వరి


ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం అంగరాల వద్ద ఆదివారం రాత్రి రోడ్డు పక్కన నిలిచి ఉన్న కారును ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. చంద్రగిరి మండలం ఐతేపల్లికి చెందిన రేఖ, భువనేశ్వరి చంద్రగిరి సంతకు వెళ్లి తిరిగి ఆటోలో ఇంటికి బయలుదేరారు. అగరాల వద్ద నిలిపి ఉన్న కారును ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేఖ, భువనేశ్వరి, ఆటో డ్రైవర్ మురళి గాయపడ్డారు. భువనేశ్వరి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనోధర్మ సంగీతంపై అవగాహన అవసరం

తిరుపతి సిటీ: కర్ణాటక సంగీతంలో మనోధర్మ సంగీతంపై విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన అవసరమని పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సంగీత కళానిధి డాక్టర్ సుధా రఘునాథన్ తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీ మ్యూజిక్, డ్యాన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఆదివారం ఆన్‌లైన్‌లో కర్ణాటక సంగీతంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మనోధర్మ సంగీతం ప్రాముఖ్యత, ఆవశ్యకత, మెలకువలను వివరించారు. వీసీ భారతి, రిజిస్ట్రార్ ఎన్.రజిని, డీన్ అనురాధ, ఆ విభాగాధిపతి డాక్టర్ శైలేశ్వరి పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి మృతి

గూడూరురూరల్ : బాలాయపల్లి మండలం పిగిలాం సమీపంలో శనివారం అర్ధరాత్రి ఆ గ్రామానికి చెందిన జయచంద్ర (32) అనే యువకుడు ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు జయచంద్ర శనివారం రాత్రి బహిర్భూమికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్


గాయపడిన కృష్ణకుమార్


టిప్పర్ కింద బైక్

రేణిగుంట : రేణిగుంట చెక్‌పోస్ట్ కూడలి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. రేణిగుంట విమానాశ్రయ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు కృష్ణకుమార్ (52) గోవింద్(50) విధులు ముగించుకుని బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఎస్‌ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థల వివాదం

- వలంటీర్ దాడి అంటూ పచ్చమీడియా పైత్యం
- రెండు రోజుల క్రితమే ఫిర్యాదు చేసిన వలంటీర్

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం కల్‌రోడ్డుపల్లిలో ఇంటి స్థలం వివాదంలో ఇరువర్గాల మధ్య నాలుగు రోజులుగా ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. వలంటీర్‌గా పనిచేస్తున్న బాధితుడు ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదు. దీంతో ఆదివారం మరోసారి గ్రామంలో ఘర్షణలు జరగడంతో ఇరువర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేశారు. చంద్రగిరి మండలం కల్‌రోడ్డుపల్లిలో గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్న గౌతమ్‌రావుకు ఒకటిన్నర సెంటు భూమి ఉంది. దీనికి రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. అందులో అతను రేకుల షెడ్డును నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆ స్థలం తమదని తిరుపతిలో ఉండే ఈశ్వరి, రామకృష్ణ పేర్కొంటూ గౌతమ్‌రావుతో నాలుగు రోజుల క్రితం ఘర్షణకు దిగారు. పనులను ఆపేశారు. రెండు రోజుల క్రితం తిరుపతి నుంచి మరో నలుగురిని తీసుకువచ్చి గౌతమ్‌రావుపై దాడికి పాల్పడ్డారు. పత్రాలు ఉంటే చూపించాలని అడిగితే రామకృష్ణ, ఈశ్వరి చూపించలేదు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మరోసారి ఘర్షణ జరిగింది. గాయపడిన గౌతమ్‌రావు శుక్రవారం చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు స్పందించలేదు. ఆదివారం రామకృష్ణ, ఈశ్వరి, మరికొందరు కలిసి మరోసారి దాడికి దిగారు. దీన్ని పచ్చమీడియా అమాయకులపై వలంటీర్ దాడి అంటూ ప్రచారం చేసింది. ఇరువర్గాల వారి ఫిర్యాదుపై చంద్రగిరి సీఐ రాజశేఖర్ స్పందించారు. భూమి హక్కులకు సంబంధించి రెవెన్యూ అధికారులను సంప్రదించాలని, ఇరువర్గాల ఘర్షణపై విచారించి, కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

అలరించిన బకాసుర వధ


ఊరేగుతున్న భీమసేనుని ఉత్సవమూర్తి

పిచ్చాటూరు : ద్రౌపదీ సమేత శ్రీధర్మరాజస్వామి తిరుణాళ్లలో భాగంగా ఆదివాయం సాయంత్ర నిర్వహించిన బకాసుర వధ ఘట్టం భక్తులను అలరించింది. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి గ్రామోత్సవం జరిపించారు. మధ్యాహ్నం భీమసేనుడి వేషధారి పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి భక్తుల నుంచి ఆహారం సేకరించారు. అనంతరం బకాసురుడితో భీకరంగా పోరాడి వధించే సన్నివేశాన్ని ఆకట్టుకునే వేషధారులు ప్రదర్శించారు. రాత్రి భీమసేనుని ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కంకణధారులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో సేవించుకున్నారు. ఉత్సవ ఏర్పాట్లను సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి పర్యవేక్షించారు.

సంఘటితమైతేనే బడుగుల అభివృద్ధి


హాజరైన ప్రజలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

తడ : సంఘటితమైతేనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం తడ ఐటీఐ ప్రాంగణంలో విక్టరీ వే క్యాంపెయిన్ ద్వారా చేపట్టిన ఐక్యతా విజయ పథకం పాదయాత్రను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక, రాజకీయ వెనుకబాటు కారణంగా బడుగు, బలహీన వర్గాలు ఆర్థికాభివృద్ధి సాధించలేకపోతున్నాయన్నారు. పేదలు తమ పిల్లకు పేదరికాన్ని, సంపన్నులు సంపదను తమ వారసులకు అందించడం ఆనవాయితీగా మారిందని తెలిపారు. దీన్ని మార్చాలంటే అన్నివర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో కోట్లకు పడగ లెత్తిన కుబేరులు ప్రపంచ దేశాలను సవాలు చేస్తూ ముందు వరుసలో ఉంటే, అనేక మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతుండడం శోచనీయమన్నారు. ఆర్థికంగా ఎదిగే పేదలకు బ్యాంకులు సైతం సహకారం అందించాలని సూచించారు. తడ నుంచి తుని వరకు మొదటి దశ పాదయాత్ర ఉంటుందని తెలిపారు. అనంతరం విజయ్‌కుమార్ సతీమణి, వివేకం సంస్థ అధ్యక్షులు విజయశ్రీ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. పేదలందరినీ సంఘటితం చేయడమే యాత్ర ముఖ్యఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలకు చెందిన నాయకులు శంకరరావు, త్యాగరాజు, రాఘవరెడ్డి, ఎలిశ, సాంబశివుడు, జగత్ ప్రసాద్ పాల్గొన్నారు.